క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు



ప్రతిష్ఠించనున్న సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలు

కోడుమూరు రూరల్: మండల కేంద్రం కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున వెలసిన పక్కీరప్ప తాత ద్వితీయ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు భక్త బృందం సభ్యులు తెలిపారు. 13వ తేదీన ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, విష్ణు సహస్రనామపారాయణం, కుంభారాధన, యాగశాల ప్రవేశం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే విధంగా 14న సుప్రభాతము, కుంభ దేవతారాధన, ప్రధాన దేవతా హోమం, 15న ఉదయం యంత్ర స్థాపనం, శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలు, కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

శాంతిరామ్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థి జతిన్‌తో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థి జాతీయ క్రీడల్లో ప్రతిభ చాటారు. జాతీయ ఫెడరేషన్ బాల్ బ్యాడిమ్మింటన్‌లో తృతీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్ణాటకలోని కుశాల్ నగర్‌లో నిర్వహించిన జాతీయ 8వ ఫెడరేషన్ కప్ పోటీలు జరిగాయన్నారు. తమ కళాశాలలో మొదటి సంవత్సర సీఎస్ఈ డెటా సైన్స్ విభాగానికి చెందిన జతిన్ ఆంధ్రరాష్ట్రం బాల్‌బ్యాడ్మింటన్ తరుపున ప్రాతినిధ్యం వహించి అత్యతం ప్రతిభ కనబరిచారన్నారు. తృతీయ స్థానంలో సాధించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం విద్యార్థిని కళాశాల సిబ్బంది, హెచ్ఓడీ శేషయ్య, పీడీ చంద్రారెడ్డి తదితరులు అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణుకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండలంలోని కొండాపురం గ్రామంలో గర్భిణులకు గురువారం ఎంఎల్‌హెచ్‌పీ భరత్ వైద్య పరీక్షలను నిర్వహించారు. గ్రామంలోని హెల్త్ క్లీనిక్‌లో గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు చేశారు. 25 మంది గర్భిణులు, 28 మంది మహిళలు, మరో 12 మందికి బీపీ, సూగర్, హెచ్‌బీ వైద్య పరీక్షలను నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎల్లనాగమ్మ, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

11 నుంచి శాంతి సదస్సు

కర్నూలు కల్చరల్: నృత్యజ్యోతి ఫైన్స్ ఆర్ట్స్ అకాడమీ 25వ వార్షికోత్సవం, టీజీవీ ఫైన్స్ ఆర్ట్స్ అకాడమీ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకొని జనవరి 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీజీవీ ఫైన్స్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు కేవీ భార్గవకుమార్ తెలిపారు. సౌత్ ఏషియన్ పీస్ కాన్ఫరెన్స్, ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన సౌత్ ఏషియా ఫెటర్నిటీ యూత్ ఆర్గనైజేషన్ వారు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. నృత్య పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి పొందిన విజేతలు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖ చేపడుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని వన్‌టౌన్, క్యాంపు సెక్షన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గురువారం ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్ పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, క్యాంపు సెక్షన్ పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు గిప్సన్ చర్చిలో ప్రార్థనలు

కర్నూలు (టౌన్): నగరంలోని గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చిలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు క్రిస్మస్ క్యారెల్స్, క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్రిస్మస్ కమిటీ సభ్యులు మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్నూలులోని యునైటెడ్ థియోలాజికల్ సెమినార్ ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ బి.మణిమంజుల హాజరై దైవ సందేశం ఇస్తారని తెలిపారు. పెద్ద సంఖ్యలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొని దేవుని ఆశీస్సులు పొందాలన్నారు.

ఆరు నెలలూ... ఆర్భాటమే !

- ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు... కొత్త పింఛనూ మంజూరు కాలేదు
- గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసినా... పక్కనపెట్టిన కూటమి సర్కార్
- సచివాలయాల్లోనూ సమాచారం నిల్... పేదలకు తప్పని ఎదురు చూపులు
- టీడీపీ కూటమి ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న పేదలు





గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

సి.బెళగల్: టీడీపీ కూటమి సర్కార్ ఆరు నెలల పాలన ఆర్భాటాలకే పరిమితమైందనే విమర్శలు అన్నివర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించడం... రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామంటూ ప్రచార హంగామా తప్పా చేసిందేమీ లేదంటున్నారు ప్రజలు. గత ప్రభుత్వం కంటే మెరుగ్గా ప్రజల వద్దకే పాలన సాగిస్తాం... వలంటీర్ల సేవలకు ఇస్తున్న గౌరవ వేతనం రూ. 5 వేలు ఏ మాత్రం సరిపోదు...పదివేలు ఇస్తామంటూ ఎన్నికల ముందు మభ్యపెట్టి సీఎం పీఠం ఎక్కిన చంద్రబాబు తన నిజస్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఊరూవాడా వినిపిస్తున్నాయి. వలంటీర్లను పక్కనపెట్టిన కూటమి సర్కార్ సచివాలయ వ్యవస్థ సేవలు ప్రజలకు అందకుండా నిర్వీర్యం చేస్తుందంటున్నారు సామాన్యులు. ప్రత్యేకించి గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలను పాలకులు పక్కన పెడుతున్నారని, పేర్లు మార్చి అయోమయానికి గురి చేస్తున్నారని పేదలు విమర్శలు గుప్పిస్తున్నారు. సచివాలయాల్లో ఏ సమాచారం లభించకపోడం ఇందుకు సాక్ష్యం. ప్రత్యేకించి పింఛన్, రేషన్ కార్డుల మంజూరుకు పేదలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. సచివాలయాలు, చివరకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు అర్హులైన పేదలు.

గతేడాది డిసెంబర్‌లో మంజూరైన పింఛన్, రేషన్ కార్డులు అందించిన కూటమి సర్కార్

కూటమి సర్కార్ పింఛన్, రేషన్ కార్డులు మంజూరు విషయం అటుంచి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో మంజూరు చేసినప్పటికీ అందజేయని తీరుపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొదటి రెండు సంవత్సరాలు అర్హులైన వారికి ఏనెలకు ఆనెలలోనే కొత్త అర్హులైన కొత్త లబ్ధిదారులను గుర్తించి రేషన్ కార్డులు, పింఛన్ మంజూరయ్యేది. అనంతరం ఆరు నెలలకు ఒక్కసారి (జూన్, డిసెంబర్) రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు చేస్తూ అర్హులకు అండగా నిలిచేది. ఈ నేపథ్యంలో సి.బెళగల్ మండలంలో 16 గ్రామ సచివాలయాల ద్వారా 2023 జూలై నుంచి డిసెంబర్ వరకు దాదాపు 1,200 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. రేషన్ కార్డుల కోసం మండల వ్యాప్తంగా 985 అర్జీలు రాగా అత్యధికంగా కార్డులలో సభ్యుల చేరిక కోసం 683, కొత్త రేషన్ కార్డుల కోసం 35 దరఖాస్తులు నమోదు అయ్యాయి. అదేవిధంగా పింఛన్ల కోసం 145 దరఖాస్తులు రాగా, అత్యధికంగా 91 మంది వృద్ధాప్య పింఛన్లకు, వితంతు పింఛన్లకు 30 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అధికారులు ఎంపిక చేసిన అర్హుల జాబితా మేరకు జనవరిలో పింఛన్, రేషన్ కార్డులు అందజేయాల్సి ఉంది. ఎన్నికల హడావిడీ, నోటిఫికేషన్ మూలంగా లబ్ధిదారులకు అందలేదు. అయితే గద్దెనెక్కిన కూటమి సర్కార్ ఈ జాబితాను పట్టించుకోలేదు. దీంతో అధికారులు తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. చివరకు పేదలకు ఎదురు చూపులు తప్పడం లేదు.

మార్పు... చేర్పులు చేయని వైనం

సచివాయాల సేవలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. దీంతో వాటి ఉనికి కోల్పోతున్నాయి. ఇంకో విధంగా చెప్పాలంటే కూటమి సర్కార్ అలా చేస్తోంది. గతంలో ఎన్నో సేవలు అందజేసిన సచివాలయ ఉద్యోగులు నేడు ఏమి తెలియదు అని చెప్పాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం మృతి చెందిన వ్యక్తి(కుటుంబ పెద్ద) పేరును రేషన్ కార్డులో తొలగించే అవకాశం ప్రస్తుతం సచివాలయాల్లో లేదు. గతంలో వలంటీర్‌కు విషయాన్ని తెలియజేస్తే వెంటనే అయిపోయేది. మృతి చెందిన వ్యక్తి పింఛన్ లబ్ధిదారుడు అయితే రేషన్ కార్డులో మార్పు చేయగానే ఆయన భార్యకు పింఛన్ మంజూరయ్యే పరిస్థితి ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. పిల్లల పేర్లు నమోదు చేయించకోలేకపోతున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గత డిసెంబర్‌లో రేషన్ కార్డు వచ్చిందన్నారు.. అయినా ఇవ్వలేదు



నాకు వివాహమైంది. నాకు, నాభార్యకు కలిపి కొత్త రేషన్ కార్డు కావాలని గతేడాది సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. గతేడాది డిసెంబర్‌లో కార్డు మంజూరైందని చెప్పారు. జనవరి నుంచి రేషన్ తీసుకోవచ్చని చెప్పారు కూడా. అయితే ఇంత వరకు అధికారులు రేషన్ కార్డు ఇవ్వలేదు. ఇప్పటికైనా రేషన్ కార్డు అందజేసి ఆదుకోవాలి.

– గుత్తిరాజు, సంగాల గ్రామం

ఎదురు చూపులు తప్పడం లేదు



నేను వితంతువును. పింఛన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే నీకు తప్పకుండ వస్తుందని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతుంది. పింఛన్ల గురించి పట్టించుకోవడం లేదు. అప్పుడు ఇస్తారు, ఇప్పుడు ఇస్తారని అంటున్నారు. మాకు మాత్రం ఎదురు చూపులు తప్పడం లేదు.

– ఆరేకంటి పాపమ్మ, వితంతువు, బురాన్‌దొడ్డి గ్రామం

అర్హులతో నిరసనలు చేపడతాం



కొత్త రేషన్ కార్డులు, పింఛన్ మంజూరుకు అర్హులైన పేదలు ఎదురు చూస్తున్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జాప్యం తగదు. అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లను వెంటనే మంజూరు చేయాలి. ప్రభుత్వం నిర్లక్ష్యం ఇంకా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీపీఎం ఆధ్వర్యంలో అర్హులందరినీ ఒక్కటిచేసి ఉద్యమిస్తాం.

– మోహన్, సీపీఎం నాయకుడు

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



కొత్త రేషన్ కార్డులు, పింఛన్ మంజూరుకు ప్రజలు దరఖాస్తులతో వస్తున్న విషయం వాస్తవమే. ఈ నెల నుంచి సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చు అని సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీంతో చాలా మంది కార్యాలయానికి వస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఇంతవరకు మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్, సి.బెళగల్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కిశోరి వికాసం పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పాణ్యం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరని, ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఎంపీపీ ఉసేన్‌బీ, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, ఎంపడీఓ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. పాణ్యం పొదుపు కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ ఆధ్వర్యంలో గురువారం కిశోరి వికాసంపై మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడైన గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే తక్షణమే హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చి వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే బాల్య వివాహాలు చేసినప్పుడు అమలు చేసే చట్టాలను వివరించారు. అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు, పొదుపు సంఘాలు సమన్వయంగా పోలీసుహకారంతో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, ఏపీఎం ప్రసాద్, ఎల్‌సీపీఓ సుదర్శన్‌రెడ్డి, సోషల్ వర్కర్ ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి



వార్డు సచివాలయం ఎదుట విద్యుత్ బిల్లును దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: ట్రూ అప్ పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్‌లోని 81, 82వ వార్డు సచివాలయాల ఎదుట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు సుధాకరప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చంద్రబాబు నాయుడు ప్రజలపై కరెంటు చార్జీలు పెంచనని ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించారన్నారు. అధికారంలోని వచ్చిన వెంటనే విద్యుత్ ట్రూఅప్ పేరుతో రూ. 20వేల కోట్లు భారం మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్ అహమ్మద్, కాశన్న, మాదన్న, ఈశ్వరమ్మ, కుమారి, లక్ష్మీదేవి, సురేఖ, సలోమి, ఖరీఫా, విజయ, రఫీయా తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కోడుమూరు రూరల్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గూడూరు నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె నాల్గవ రోజు కొనసాగింది. ఈ మేరకు గురువారం కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు అరవింద్, మధు మాట్లాడుతూ చాలిచాలని జీతాలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికులు ప్రభాకర్, షబ్బీర్, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, సుధాకర్, ఆలీబాషా, హరి, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అనర్హుల పింఛన్లను తొలగిస్తాం

- కాల్వ రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: ప్రభుత్వం మంజూరు చేసిన సామాజిక భద్రత పింఛన్ల తనిఖీలు నిర్వహించి అనర్హులైన వారి పింఛన్లను రద్దు చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మండలంలోని కాల్వ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఎమ్మెల్యేతో పాటు, డీపీఓ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే జనవరి నెల నుంచి కొత్త పింఛన్ల మంజూరుకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి, అర్హులైన వారికి రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయడమే గాక, ఇళ్ల నిర్మాణాలకు రూ.2.50 లక్షలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం బాధిత రైతుల నుంచి వినతులను స్వీకరించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ భాస్కర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కట్టుగా కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పీఎస్‌లు, గ్రామ సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధికి కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రవిప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఏపీఎం సుబ్బయ్య, పీఆర్ ఏఈ గంగరాజు, ఎంఈఓ వసంతలక్ష్మి, శిక్షణా కార్యక్రమాల జిల్లా మేనేజర్ గిరీష్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధించాలి

ఓర్వకల్లు: గ్రామాలలో సుస్థిర అభివృద్ధిని సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వం చేపట్టిన సుస్థిర అభివృద్ధి-లక్ష్యాల సాధనలో భాగంలో గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందికి రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీపీఓ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం పేదరిక నిర్మూలన, మహిళ, శిశువు సంరక్షణ, క్లీన్ అండ్ గ్రీన్ అంశాలపై రీసోర్స్ పర్సన్లు ఉప్పలపాడు పంచాయతీ కార్యదర్శి గోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు.

కర్నూలు(రూరల్): మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం అధికారులు, సర్పంచ్‌లకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై ఎంపీడీఓ రఘునాథ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ఈవీ సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పాటుపడాలని సూచించారు.

కల్లూరు: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల స్థిరమైన అభివృద్ధి స్థానికీకరణ లక్ష్యాల ద్వారా సాధ్యమవుతుందన్నారు.

మొక్కుబడిగా సాగిన శిక్షణ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో గురువారం అధికారులు, సర్పంచ్‌లకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ పై శిక్షణా కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. మండల అధికారులకు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, కొన్ని శాఖల సచివాయల ఉద్యోగులకు చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాణెమ్మ ప్రారంభించారు. అయితే షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభం కావాల్సిన శిక్షణ కార్యక్రమం, 11 గంటల అనంతరం ప్రారంభం అయ్యింది. మధ్యాహ్నం రెండు గంటలకు భోజన విరామం అనంతరం అధికారులు, సర్పంచ్‌లు శిక్ష బయటకు వెళ్లిపోయ్యారు. ఉన్నవారితోనే అధికారులు పూర్తి చేశారు.

పాఠశాల తనిఖీ

సి.బెళగల్: మండల పరిధిలోని కొండాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలను గురువారం మండల ప్రత్యేకాధికారిని, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. అదేవిధంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన వడ్డింపు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు సతమతం అయ్యారు. ఎలాంటి సమాచారం లేకుండా కోతలు విధిస్తున్న తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. వేసవి కాలం ప్రారంభం కాకముందే కోతలు మొదలైయ్యాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకోని కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నదిలో స్నానానికి వెళ్లి పంజాబ్ వాసి మృతి



నదిలో నుంచి మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు

కర్నూలు(రూరల్): నదిలో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పంజాబ్ వాసి మృతి చెందిన ఘటన బుధవారం కర్నూలు మండలంలో చోటుచేసుకుంది. ఘటనపై కర్నూలు తాలుకా ఎస్ఐ యం.నరేష్ తెలిపిన వివరాల మేరకు.. పంజాబ్ రాష్ట్రం, జలంధర్ పట్టణానికి చెందిన దుగ్గాల నరేష్ (42) బుధవారం సాయంత్రం 6 గంటలకు కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సమీపంలో తుంగభద్ర నదిలో స్నానం చేసేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నది లోతుకు వెళ్లడంతో ఈత రాక నీటమునిగి మృతి చెందాడు. గురువారం నదిలో శవం తెలియాడుతున్నట్లు స్థానిక ప్రజలు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటికి తీసి విచారణ చేపట్టారు. మృతిచెందిన నరేష్ రెండు నెలల క్రితమే పంచలింగాల పరిధిలోని ధూమ్ డాబాలో సర్వర్‌గా పనిలో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీకి తరలించారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న మహిళా పోలీసు స్టేషన్ సీఐ ఆదిలక్ష్మి

కర్నూలు సిటీ: విధులు నిర్వహించే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నేరం రుజువైతే కఠిన చర్యలు ఉంటాయని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఆదిలక్ష్మి అన్నారు. గురువారం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన లైంగిక వేధింపులను నిర్మూలించేలా అవగాహన సదస్సు నిర్వహించారు. పని ప్రదేశాల్లో పురుషులు, మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు చట్టాలపై అవగహన కలిగి ఉండాలన్నారు. ప్రతి మహిళలో ఓ తల్లి, చెల్లి, కూతురును చూడగలిగితే ఎలాంటి ఆఘాయిత్యాలు చోటు చేసుకోవని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి అన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు హేమంత్, సత్యనారాయణ, మహిళ సాధికారత విభాగం కన్వీనర్ ఎస్.షాజిదాబీ, కాలేజీ ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ ఎస్.పక్రున్నీసా బేగం, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

గడివేముల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని బిలకల గూడూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి 12 అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య, ఈఓ నాగప్రసాద్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కర్ణ, వీఆర్వోలు ఇందిరమ్మ, ఆంజనేయులు, కృష్ణ, నాయుడు,హరిచంద్ర, నాయకులు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం తహసీల్దార్ ఆంజనేయులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సివిల్ సప్లయ్ డివిజనల్ మేనేజర్, నోడల్ ఆఫీసర్ నాగసుధ హాజరయ్యారు. వివిధ భూ సమస్యలపై 41 వినతులు అందాయని తహసీల్దార్ తెలిపారు.

సి.బెళగల్: మండల పరిధిలోని కొండాపురంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మండల ప్రత్యేకాధికారిని, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల హాజరయ్యారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన డీడీ ప్రతి సమస్యకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ సీతరామిరెడ్డి, మండల సర్వేయర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కర్నూల(రూరల్): మండల పరిధిలోని జి. సింగవరం గ్రామంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ నిర్వహించారు. వక్ఫ్, వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయించాలని ఆ గ్రామానికి చెందిన నాగన్న వినతి పత్రం అందజేశారు. వివిధ భూ సమస్యలపై 18 మంది రైతులు వినతులు అందజేశారని డీటీ తెలిపారు.

ఎమ్మెల్యే రాక కోసం పడిగాపులు

కోడుమూరు: మండల కేంద్రం కోడుమూరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆలస్యంగా రావడంతో అధికారులతో పాటు ప్రజలకు పడిగాపులు తప్పలేదు. వాస్తవానికి ఎమ్మెల్యే 10 గంటలకు రావాల్సి ఉంది. అయితే 12 గంటలైనా రాకపోవడంతో రైతులు అసహనానికి గురయ్యారు. రైతుల నుంచి వినతులు స్వీకరిస్తే ఎమ్మెల్యే వచ్చేసరికి ఎవ్వరూ ఉండరనే ఉద్దేశంతో అధికారులు నిరీక్షించారు. సదస్సులో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మండల స్పెషలాఫీసర్ ఏడీఏ సాలురెడ్డి, డీటీ రామాంజినేయులు, గ్రామ సర్పంచు భాగ్యరత్న, టీడీపీ నాయకులు కేఈ.మల్లికార్జున గౌడ్, గోపాల్‌నాయుడు, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా మహేష్



మహేష్, ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

కర్నూలు(అర్బన్): రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా లా స్టూడెంట్ మహేష్‌ను నియమిస్తూ ఆర్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు రాజాస్ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తు విద్యారంగ సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని, ప్రతి నెలా జిల్లాలో ఆర్ఎస్ఎఫ్ పనితీరుపై అప్‌డేట్స్ పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియమించారని, జాతీయ నాయకత్వం నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో పటిష్ట ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు. త్వరలోనే జిల్లావ్యాప్తంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

క్లుప్తంగా

నేడు కాల్వలో రెవెన్యూ సదస్సు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. సదస్సుకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలపై వినతులు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు కోడుమూరులో......

కోడుమూరు రూరల్: భూసమస్యల పరిష్కారంలో భాగంగా గురువారం మండలంలోని కోడుమూరులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

పరామర్శ



గజేంద్ర ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలం పోలకల్ గ్రామానికి చెందిన గజేంద్రను కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ బుధవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆదిమూలపు సతీష్ ఆసుపత్రికి వెళ్లి గజేంద్రతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. అక్కడున్న వైద్యులతో మాట్లాడి గజేంద్రకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

పొలాల రస్తాలు బాగు చేయించండి



పీడీ వెంకరమణయ్యతో చర్చిస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: రైతులు పొలాలకు వెళ్లే రస్తాలు దారుణంగా ఉన్నాయని, బాగు చేయించేందుకు అనుమతించాలని డ్వామా పీడీ వెంకరమణయ్యను ఎంపీపీ బొంతల మునెప్ప కోరారు. బుధవారం సాథనిక మండల పరిషత్ కార్యాలయంలో పీడీతో ఎంపీపీ సమావేశమయ్యారు. పొలాలకు వెళ్లేందుకు, దిగుబడులు తెచ్చుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ పీడీ దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిషత్ నిధులతో బాగు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని ఎంపీపీ కోరారు. సమావేశంలో అడిషనల్ పీడీ మాధవీలత, ఏపీడీ అల్లీపీర, ఎంపీడీఓ రాణెమ్మ తదితరులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



టీకాల ప్రయోజనాలను వివరిస్తున్న శ్రీనువాసులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నిడ్జూరు గ్రామం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో బుధవారం వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యతపై జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనువాసులు అవగాహన కల్పించారు. గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు అందజేసే టీకాల ప్రాముఖ్యతను శ్రీనివాసులు వివరించారు. ఈ టీకాల ప్రయోజనాలను వివరించి ప్రజలను చైతన్య పరచాలని ఆరోగ్య కార్యకార్తలకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సరస్వతి, ఆశా కార్యకర్తలు లలితమ్మ, రాములమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేద్దాం

కర్నూలు కల్చరల్: హైందవ శంఖారావ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శౌర్య దివస్ బైక్ ర్యాలీని ఓల్డ్ బస్టాండ్‌లోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ వినాయక ఘాట్ వరకు సాగింది. అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హిందూ సమైక్యతను తెలిపేందుకు జనవరి 5వ తేదీన జరగబోయే హైందవ శంఖారావానికి లక్షలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి కోటేశ్వరరావు ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. ఆలయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందువులపై దాడులు జరగకుండా జాగ్రుతం కావాలన్నారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్ఎస్, బీజేపీ, కులసంఘాలు, ధార్మిక సంఘాలు, హిందూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుద్రోహి చంద్రబాబు

- అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం
- 13వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ఉదయానంద ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలి
- జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: గతంలో వ్యవసాయం దండగ అని అన్నదాతను చిన్నచూపుచూసిన సీఎం చంద్రబాబు నాయుడు రైతుద్రోహి అని, దేశానికి వెన్నెముక రైతన్న అనే విషయాన్ని మరిచి వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలభిస్తున్న కూటమి సర్కార్‌పై ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటాలకు సిద్ధం అయ్యిందని, ప్రతిఒక్కరూ మద్దతు తెలుపాలని కోరారు. ఇందులో భాగంగా రైతు సమస్యలపై ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నామన్నారు. ముందుగా ఉదయానంద ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో కాటసాని మాట్లాడారు. ఆరు నెలల కూటమి పాలనలో మాటలతో మభ్యపెట్టడం తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గత ఎన్నికల్లో కేవలం అధికార దాహంతో కుటిల రాజకీయాలకు పాల్పడ్డారని, జనసేన, బీజేపీతో పొత్తులు పెట్టుకుని గద్దె నెక్కారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందజేస్తామని, ప్రజల వద్దకే పాలన కొనసాగిస్తామని ప్రజలను మభ్యపెట్టి గద్దె నెక్కిన సీఎం చంద్రబాబు తన నిజస్వరూపం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, రైతుల కష్టాలను ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. సచివాలయ, రైతుభరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, ప్రజలకు సేవలు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించి సీఎం కుర్చీపై కూర్చున్న చంద్రబాబు ఆరునెలల పాలనలో ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ప్రజలకు అండగా ఉండాల్సిందిపోయే, సర్దుబాటు అంటూ విద్యుత్ భారం మోపారన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని అబద్ధపు హామీలు గుప్పించిన చంద్రబాబు ఈ 6 నెలల్లోనే రూ.15 వేల కోట్లు భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న టీడీపీ కూటమి సర్కార్‌ను నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీతో ప్రతిఒక్కరూ కలిసి రావవాలని కాటసాని పిలుపునిచ్చారు.

రూ. 20 వేలు పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు ?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మెరుగ్గా సంక్షేమ పథకాలు అందజేస్తా... ప్రజల వద్దకే పాలన ఇంకా మెరుగ్గా కనసాగిస్తానంటూ అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు ఆరునెలల పాలనలో చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే కాటసాని ధ్వజమెత్తారు. రైతుల అంటే గిట్టని చంద్రబాబు ఎన్నికల ముందు మాత్రం ప్రేమ ఒలకబోశారని, తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామని నమ్మబలికారని గుర్తు చేశారు. ఖరీఫ్ సీజన్ పూర్తయ్యిందని, రబీ కూడా ప్రారంభమైనా పెట్టుబడి సాయం రైతులకు అందలేదని, ఇంకెప్పుడు ఇస్తారని చంద్రబాబును కాటసాని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచిత బీమా పథకం అమలు చేసిన విషయాన్ని గుర్తు చేసిన కాటసాని, సీఎం చంద్రబాబు మాత్రం బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ అన్నదాతలపై తనకున్న వ్యతిరేకతను చెప్పకనే చెప్పారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, కష్టారెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి మేఘనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పుల్లయ్య, రమేష్, మహేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఓర్వకల్లు: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు తప్పని సరిగా ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ సుధాకర్ తెలిపారు. మండలంలోని పూడిచెర్ల గ్రామంలో బుధవారం ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన కంది, శనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మంజూరుకు ఈ-క్రాప్ నమోదును పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే శనగ, జొన్న, వేరుశనగ, వరి తదితర పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద మంజూరయ్యే బీమాకు రైతులు ప్రీమియం సొమ్మును తప్పనిసరిగా చెల్లించాలని పేర్కొన్నారు. శనగ ఎకరానికి రూ.420, జొన్న- రూ.297, వేరుశనగ - రూ.480, వరికి రూ.630 చొప్పున ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆనందలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సోలార్ పరిశ్రమలో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో ఉన్న సోలార్ పరిశ్రమలో తీగల చోరీ జరిగింది. ఈ మేరకు కంపెనీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సోలార్ పరిశ్రమలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అలాగే గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని చెప్పారు. అలాగే చోరీ తీగెల విలువ భారీగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

విద్యార్థుల ఖాతాల్లో నగదు డిపాజిట్

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5వేలు చొప్పున వారి విద్యాభ్యాసానికి డిపాజిట్ చేసినట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మెనేజర్ సురేష్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. తొమ్మిదవ తరగతి ప్రశాంతి, ఎనిమిద తరగతి ప్రవళిక , ఏడవ తరగతి వైష్ణవిలకు ఏపీజీబీ తరుపున స్కాలర్‌షిప్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం నారా యణ తదితరులు పాల్గొన్నారు.

దగాకోరు కూటమి సర్కార్‌పై పోరాటం



ధర్నా పోస్టర్లను విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ డా.సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న దగాకోరు కూటమి ప్రభుత్వంపై ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటాలకు సిద్ధం అయ్యిందని, ప్రతిఒక్కరూ మద్దతు తెలుపాలని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. రైతులు సమస్యలు పరిష్కరించాలని ఈనెల 13న కర్నూలులో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆదిమూలపు సతీష్ చేతుల మీదుగా మండల కన్వీనర్ రమేష్‌నాయుడు విడుదల చేయించారు. ఈ సందర్భంగా డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల్లో ఏడాదికి ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇస్తామని చెప్పి నేడు పంగనామాలు పెట్టిందన్నారు. ఉచిత పంటల బీమా, పండిన పంటలకు గిట్టుబాటు ధర వంటివి కల్పించకుండా కూటమి ప్రభుత్వం రైతులను దారుణంగా మోసం చేస్తోందని విమర్శించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా రైతులకు సమయానికి పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమాను అమలు చేసి ఆదుకున్న ఘనత తమ నాయకుడు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే భయమేస్తోందంటూ చంద్రబాబు చెబుతున్న మాటలను చూస్తే ప్రజలకు ఏవగింపు కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 13న రైతులతో కర్నూలులో చేపట్టనున్న ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాలకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచు మాదులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, లింగన్న, రాఘవేంద్ర, మగ్బుల్‌బాషా, శ్రీనివాసులు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయొచ్చు



క్యాన్సర్ లక్షణాలు వివరిస్తున్న డాక్టర్ శైలేష్‌కుమార్

కల్లూరు: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చునని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సల్కాపురం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిగా బరువు తగ్గడం, జ్వరం, అలసట, శరీరములో మార్పులు, అసాధారణ రక్తస్రావం, మలమూత్ర విసర్జనలో మార్పులు, రొమ్ములో గడ్డలు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ దంత వ్యాధుల లక్షణాలను వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి మండలంలోని ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో రైతులతో సమావేశమైన ఏఓ సాగు మెలకువలు సూచించారు. అనంతరం పంట పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతం తయారీ, వినియోగ పద్ధతులపై సిబ్బందితో డెమో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందువు, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, జెడ్ బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆడిట్‌కు అందని సహకారం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత 20 రోజులుగా ఏజీ ఆడిట్ నిర్వహిస్తున్నారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ చాంబర్‌లో ముగ్గురు సభ్యుల బృందం ఆడిట్ నిర్వహిస్తోంది. దాదాపు ఆరేళ్ల తర్వాత ఆడిట్‌కు రావడంతో ఫైళ్ల సంఖ్య అధికమైంది. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు ఆడిట్ బృందం అడిగిన ఫైళ్లు వారి ముందు ఉంచి వస్తున్నారు. అయితే తమకు ఫైళ్ల గురించి వివరంగా చెప్పడం లేదంటూ సూపరింటెండెంట్‌కు ఆడిట్ బృందం ఫిర్యాదు చేసింది. కొందరు ఉద్యోగులు తమకు సహకరించడం లేదని పేర్కొంది. కొన్ని ఫైళ్లు అర్థం కావడం లేదని, అడిగితే స్పందించడం లేదని ఆరోపించింది. ఆసుపత్రిలో గత కొన్నేళ్లుగా వైద్యపరికరాలు, స్టేషనరీ, సివిల్ పనులు, ఇతర వస్తువుల కొనుగోలు, పెట్టిన ఖర్చుకు సంబంధించిన వివరాలు, బిల్లులు సక్రమంగా లేవని ఆడిట్ అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు పలువురు ఉద్యోగులను తన చాంబర్‌లోకి పిలిచి మందలించినట్లు సమాచారం. ఆడిట్ అధికారులు అడిగిన సమాచారం ఇవ్వడంతో పాటు వారికి వివరంగా చెప్పాలని ఆదేశించినట్లు తెలిసింది.

అంకిత భావంతో బాధ్యతలు నిర్వర్తించాలి

- డ్వామా పీడీ వెంకటరమణయ్య



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పనుల వివరాలు తెలుపుతున్న ఉపాధి సిబ్బంది

సి.బెళగల్: ఉపాధి సిబ్బంది అంకితభావంతో బాధ్యతలు నిర్వర్తించాలని, కూలీలకు అండగా నిలువాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య సూచించారు. మండలంలో 22/11/2024 నుంచి 10/12/2024 మధ్య కాలంలో ఉపాధి హామీ కింద పంచాయతీ రాజ్ శాఖలలో చేపట్టిన రూ.15.90 కోట్ల పనులకు సంబంధించి 17వ సామాజిక తనిఖీలపై సి. బెళగల్‌లో అధికారులు ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా జిల్లా డ్వామా పీడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉపయోగార్థంగా, గ్రామాలు అభివృద్ధి చెందేలా పనులను నిర్వహించాలన్నారు. ఉపాధిహామీ పథకం అమలులో తప్పులు చేసేవారికి శిక్షలు తప్పవని, ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పండ్లు, పూల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. మండలం అభివృద్ధి చెందేలా పనులను చేపట్టాలని ఈ సందర్భంగా ఎంపీపీ బొంతల మునెప్ప పీడీని కోరారు.

రూ.98,898 అవకతవకలు

మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో చేపట్టిన ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ పనులపై ఎస్ఆర్పీ విజయభాస్కర్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది డీఆర్పీలు గ్రామాలలో 17వ విడత సామాజిక తనిఖీలను నిర్వహించారు. మండలంలో 1,283 ఉపాధి పనులకు రూ.12,49,36,658, అదేవిధంగా 32 పంచాయతీరాజ్ పనులకు రూ.3,24,48,557, ఒక ఆర్‌డబ్ల్యూఎస్, ఒక ఎస్ఎస్ఏ పనులతో మొత్తం మండల వ్యాప్తంగా 1,317 పనులకు వెచ్చించిన రూ.15,90,28,,072 ఖర్చులపై తనిఖీ జరిగిందని ఎస్ఆర్పీ తెలిపారు. అన్ని పంచాయతీలో పనులలో తప్పులపై రూ.49,398, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై రూ.47,500 జరిమానాతో కలిపి మొత్తం రూ.96,898 అవకతవకలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి హామీ పనుల విజిలెన్స్ అధికారి లోకేష్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ఆదినారాయణ, అడిషనల్ పీడీ మాధవిలత, ఏపీడీ అల్లిపీర, తనిఖీ బృందం మేనేజర్ సునీల్, ఎంపీడీఓ రాణెమ్మ, ఏపీఓ రామన్న, లక్ష్మన్న, ఈసీ పృద్వీరాజ్, పీఆర్ ఏఈలు వెంకటప్రకాష్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

సి.బెళగల్: మండల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాయల ఉద్యోగులకు గురు, శుక్రవారాలు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. స్థానికీకరణ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై మొదటి విడతలో భాగంగా రెండురోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగే శిక్షణా కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు పాటుపడాలి



మాట్లాడుతున్న బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె రూరల్ : బాల్యవివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ పాటుపడాలని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక పొదుపు భవనంలో ఐసీడీఎస్ బనగానపల్లె ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అధ్వర్యంలో బుధవారం కిశోరి వికాసంపై నిర్వహించిన మండలస్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమానికి అతిథులుగా సీఐతోపాటు ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఎం శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లను ఆడ,మగ అనే తేడా చూపించరాదని, ఇద్దరికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదకలిలపై ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. బాలల పరిరక్షణ, హక్కులు తదితర అంశాలపై ఎంపీడీఓ, ఎంపీఎం,హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్బరాయుడు, అయ్యమ్మ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, జమిలా, శైలజ, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు,వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు కొరవడిన ప్రజా స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి స్పందన కొరవడింది. బుధవారం మండలంలోని పూడిచెర్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రైతులు అనుకున్న స్థాయిలో హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. తహసీల్దార్ విద్యాసాగర్ అధ్వర్యంలో జరిగిన సదస్సులో వివిధ భూ సమస్యలపై 17 మంది వినతులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం, వీఆర్ఓ, గ్రామస్థాయి సర్వేయర్లు, గ్రామ నాయకులు వెంకటశివుడు, ప్రకాశం, పుల్లారెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 36 దరఖాస్తులు

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో బుధవారం తహసీల్దార్ నరేంద్రకుమార్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 36 మంది రైతులు వినతులు సమర్పించారని తహసీల్దార్ తెలిపారు.

కోడుమూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో నెల కొన్న భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని లద్దగిరి గ్రామంలో తహసీల్దార్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు.రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పట్టి హనుమంతు, ఏడీఏ సాలురెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు:మండల పరిధిలోని యాపర్లపాడు గ్రామంలో బుధవారం తహసీల్దార్ ఆంజనేయులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన సివిల్ సప్లయ్ డివిజనల్ మేనేజర్, నోడల్ ఆఫీసర్ నాగసుధ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి 20 వినతులు అందాయని తహసీల్దార్ తెలిపారు. అయితే రెవెన్యూ సదస్సులకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ శారద, ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు.

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారులు నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రైతులు, ప్రజల నుంచి స్పందన కరువైంది. గ్రామ సచివాలయ ఆవరణలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించగా స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారిని, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల హాజరయ్యారు. రెవెన్యూ సదస్సుపై ప్రజలు, రైతులు ఆశక్తి చూపకపోవడంతో అధికారులు ఎదురు చూశారు. వివిధ భూ సమస్యలపై కేవలం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు వీఆర్వోలు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ సీతరామిరెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న డీటీ శివ ప్రసాద్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఈ తాండ్రపాడు గ్రామంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శివ ప్రసాద్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 12 వినతులు అందాయని డీటీ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కార్మికుల సమస్యలు పట్టవా?

- మూడో రోజుకు చేరిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన
- విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న కార్మికులు



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): విధులను బహిష్కరించాం. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా..ఈ ప్రభుత్వం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తోందని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అరకొర జీతాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం తమకు వేతనాలు పెంచాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మికుడి కుటుంబంలో మరొకరికి ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ ప్రధాన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె వీడమని స్పష్టం చేశారు. అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, రమేష్, జ్ఞానమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

పూచీకత్తు లేకుండా రుణాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): పీఎం విశ్వకర్మ యోజన పథకంలో పూచీకత్తు లేకుండా లక్ష రూపాయల రుణాన్ని రజకులకు ఇవ్వాలని ఏపీ రజకవృత్తిదారుల ఓల్డ్ సిటీ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, జయమ్మ, న్యూసిటీ నగర కమిటీ కార్యదర్శి శేషాద్రి డిమాండ్ చేశారు. బుధవారం చాకలి ఐలమ్మ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ యోజన నిబంధనలు మేరకు ఆన్‌లైన్‌లో దోబీ పరికరాల కోసం నమోదు చేసుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఐదు రోజులపాటు శిక్షణ కూడా తీసుకున్నామని, శిక్షణలో ప్రతీరోజూ రూ.500 చెల్లిస్తామని చెప్పారని, నెల రోజులు గడిచినా ఇవ్వలేదన్నారు. అంతేగాక పరికరాల కోసం మంజూరు చేసే రూ.లక్ష రుణానికి పూచీకత్తు లేకపోవడంతో బ్యాంకులు తిరస్కరిస్తున్నాయని చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంలో పూచీకత్తు లేకుండా రుణాలను మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 16వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు.